కథ

# అమ్మమ్మకో అప్పగింత

డా. కొలకలూరి మధుజ్యోతి

ప్రియమైన అమ్మమ్మా!
నేను... మాధురీని.
అమ్మ నీ దగ్గరకు ప్రయాణమై పోయింది. ఎవరికీ ఏమీ చెప్పకుండా. నిర్ణయాలలో అమ్మకు స్వేచ్ఛ ఎప్పుడూ ఉంది కదా! మాకు తెలిస్తే వద్దంటాం అనుకొందో... ఆపేస్తాం అనుకొందో... వెళ్ళనీం అనుకొందో... ఏమీ చెప్పలేదు.

అమ్మ అంటే మాకెంత ప్రేమో తెలుసు కదా....! నాన్న అమ్మని పువ్వుల్లో పెట్టుకొని చూశాడు. లేమిలోను కాస్త ఉన్నంతలోనూ ఉన్న స్థితిలోనూ ఎలాంటి ఆర్థికస్థితిలోనైనా అమ్మను బాగా చూసుకొన్నాడు. మీరు కాదన్నా నాన్నను పెళ్ళి చేసుకొని అమ్మ ఎంత నిశ్చింతగా గడిపింది కాలాన్ని...?! వాళ్ళిద్దరి ప్రేమ ఎంతమందికి ఆదర్శంగా నిల్చింది...?! మా కుటుంబం మేమున్న వీధికే అనుబంధాల మాధుర్యానికి పేరెన్నికగనింది కదా....! అంతటి ప్రేమ వారిది. మేమూ....?! మేము మా అమ్మని ఎంత ప్రేమించాం....? అన్నం కలిపే అమ్మ చేతి గాజుల గలగలలు, అమ్మ నడిచి వస్తుంటే పాదాల మెట్టెల చప్పుడు, అమ్మ చీరె చెరుగు రెపరెపలు ఎన్ని అపురూప భావనలు...? అమ్మను ప్రేమించటం మాత్రమే కాదు... అమ్మను ఎంత గౌరవించాం...? నువ్వు చూడలేదు కాని... అది నిజం. అమ్మకు, నాన్నా మేము ఇచ్చే స్థానం పట్ల ఎంత గర్వం...? ఎంత ఆనందం...? అవి అనుభవించే అమ్మ ముఖంలో ఎంత వెలుగు ఎంతెంత తాదాత్మ్యం...?! చూసి తీరాలి.

ఆఫీసుకు వెళ్ళొచ్చే అమ్మ, ఇంటా బయటా పనితో నలిగి పోతోందని నాన్న పనికి వంటకీ కూడా మనిషిని పెట్టాడు. వంట మనుషులు లేని రోజుల్లో అమ్మ క్యాంపుల నుంచి వచ్చే సరికి మేం వంట చేసే వాళ్ళం. మా అమ్మ ఎండ కన్నెరగని తల్లి అననుకాని, అమ్మ కష్టాన్ని మేమంతా పంచుకొన్నాం పనులు నేర్చుకున్నాం. అమ్మ కష్టాన్ని సుఖాన్ని కూడా మాతో ఇష్టంగా పంచుకొంది. మరిప్పుడు... ఇదేమిటి... చెప్పకుండా ప్రయాణమై పోయింది.

అమ్మమ్మా.... అమ్మకు నువ్వంటే ఎంత ఇష్టమో తెలుసా...? ఎంతమందికి నువ్వు జీవితాన్ని చూపావు...? ఎంత మంది స్త్రీలు తమ కాళ్ళ మీద నిలబడేలా చేశావు....? చూపు పోయినా స్త్రీలకు ఆర్థికంగా నిలదొక్కుకొనే మార్గాలు ఎన్నిచూపావు...? అమ్మ చెప్తూఉంటే రోమాంచిత మయ్యేది. పసి తనంలో నిన్ను చూసిన మాకు కళ్ళు కనిపించని బోసి నోటి అమ్మమ్మే తెలుసు. ఇవన్నీ మా అమ్మ గర్వంగా చెప్తుంటే ఇక్కడ లేని నిన్ను ముద్దెలా పెట్టుకోవాలి అని దిగులేసేది? అసలంత ఎందుకు 1950లలోనే నువ్వు నీ కూతుళ్ళనిద్దరినీ బియ్యేస్సీ చదివించావంటేనే, నువ్వు ఎంత అద్భుతమైన స్త్రీవో తెలుస్తుంది. చదువే అరుదైన ఆ రోజుల్లో, అందునా ఆడపిల్లలను చదివించావంటేనే నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. ఉద్యోగం కోసం గోదావరి నుంచి రాయలసీమకు అమ్మను, సిమ్లాలో మిలట్రీలో ఉద్యోగానికి పిన్నినీ, పంపిన నీ సాహసం వారి తెగువ నాకు ఎప్పుడూ అద్భుతమే...! మరి నీలాంటి అద్భుతమైన తల్లిని ఏ బిడ్డైనా ప్రేమించకుండా ఉండగలదా...? నీకు తెలుసా... ఈ ప్రయాణానికి ముందు, అమ్మకు నువ్వు కలలోకి వచ్చావు. ఇక్కడెక్కడో కాదు గోవాలో. సరిగ్గా నెల ముందు అమ్మా నాన్న ఇద్దరూ ప్రశాంతంగా పది రోజులు గడిపి రావాలని గోవా వెళ్ళారు. కానీ, అమ్మ తీవ్ర అనారోగ్యానికి గురయ్యింది. హాసిటల్లో చేర్చారక్కడ. ఓ రోజు నువ్వు కలలోకి వచ్చి, అమ్మ చుట్టూ తిరుగుతూ 'చెల్లి నా దగ్గరే ఉంది నిన్నూ తీసుకెళ్తా' నన్నావట. అది మొదలు. అప్పుడే నిర్ణయించుకొందా... నీ దగ్గరకు రావాలని...? ఏమో...? నేను మా అమ్మతో ఎప్పుడూ గొడవ పడేదాన్ని.... నా కంటే అక్క నాలుగేళ్ళు ముందు పుట్టి, నా కంటే ఎక్కువ ప్రేమ తీసేసుకొందని. మా అక్క పెళ్ళి అయ్యాక నా గారం నా అల్లరి మా అమ్మ దగ్గర అంతా ఇంతా కాదు. రెండు చేతులా ప్రేమను అలా అలా కొల్లగొట్టేశాను. నాలో కలిగినలాంటి భావన ఏమైనా అమ్మకూ కలిగి ఉంటుందా....? చెల్లి ఒక్కతే అమ్మ ప్రేమ పొందుతూ ఉందని అనిపించిందా...? అందుకనే చెప్పకుండా ప్రయాణ మయ్యిందా..? ఏమో...!

మా అమ్మకు నేనంటే ఎంతిష్టమో తెల్సా! నిన్నిష్టపడినంత కాకపోయినా నేనంటే ఇష్టం చాలా ఉంది. తల్లికి అందరి మీదా ఉంటుంది. కాని నాపై అమ్మ చూపే ప్రేమ ప్రత్యేకంగానే అనిపిస్తుంది. బాగా చదువుకొంటానని ఇష్టం. పిల్లల్ని సంస్కారవంతంగా పెంచుతున్నానని ఇష్టం. నేనంటేనే కాదు శ్రీవారిని పిల్లలనూ కూడా బాగా ఇష్టపడింది. గోవాలో తీవ్ర అస్వస్థతకు గురయినప్పుడు, రాత్రికి రాత్రి ఆగమేఘాలపై అందరూ

## Story



అక్కడికి చేరారు – నేను తప్ప. పది రోజుల హోరాహోరి పోరాటం తర్వాత అమ్మ తేరుకొంది. హైదరాబాదుకు పసిపాపను తెచ్చినట్టే తెచ్చారు. బాగానే కోలుకొంది. మళ్ళీ పరీక్షలకని హాస్పటల్లో చేర్చారు. వారాంతపు సెలవులకు నేను బయలుదేరుతున్నాని ఫోను చేస్తే నాన్న వద్దన్నారు. బాగా లేకపోతే నే చెప్తా కదమ్మా... వద్దు అన్నారు. అప్పుడు అమ్మ అంది... ‘అమ్మను చూడలేక పోయానని బిడ్డ ఎంత కొట్టుకులాడుతోందో రానివ్వండి...’ అని నన్నూ బిడ్డల్నీ చూడటానికి, నేను అమ్మను చూడటానికి పోరాడి గెల్చి మరీ వచ్చిందీ అమ్మ? అంతే కావాలి. అందరినీ అక్కడ చూసింది. రాని నా కోసం జవసత్వాలు పుంజుకొని వచ్చింది అమ్మ. అమ్మను అప్పుడు చూసిన రూపం ఆ నైటి ఆ గోరింటాకు వలన ఎర్రదనంతో మెరుస్తున్న వెంట్రుకలు, కార్పొరేట్ హాస్పటల్ రూం, ఆ రూంలో టీవీ అలా అన్నీ కళ్ళ ముందు ముద్రించుకు పోయాయి. కాసేపు పిల్లలతో గడిపిన అమ్మ ఎంత అలసటగా ఉందో?! అంత ప్రేమ పంచే అమ్మ, మాట మాత్రంగా కాని సూచనప్రాయంగా, కాని తన ప్రయాణపు ఆలోచనను చెప్పనే లేదు.

అమ్మమ్మా...! నీకు లాగానే అమ్మకూడా తక్కువ మాట్లాడేది. కాని, మాటల్లో ఎంత లోతు బరువు ఉండేవో. నాన్న ప్రేమను చాటినంత ఎక్కువగా అమ్మ చూపటం చాలా తక్కువ. నాన్న దగ్గర ఉంటే వికాసంగా, దూరంగా ఉంటే అనాసక్తంగా ఉండేది. ఉద్యోగ విరమణ తర్వాత ఇది ఇంకా ఎక్కువ తెలిసేది. ఆయన వ్యాపకాలలో అయన ఉన్నా, రోజులో అప్పుడోసారి కని

పించి ఇప్పుడోసారి పలకరిస్తే తృప్తిగా ఉండేది. తనతో ఏం మాట్లాడినా మాట్లాడకపోయినా, తనేం మాట్లాడకపోయినా, మనిషి తారాడుతుంటే ఎంతో నెమ్మదిగా ఉండేది అమ్మకు. పదేళ్ళ క్రితం గుండె ఆపరేషన్ జరిగినప్పుడు, నాన్న ఒక్కడే హోటల్ రూంలో ఎంతలా ఏడ్చాడో ఎన్ని సార్లు చెప్పేదో... ఒక్కసారి కూడా తన శారీరక హింసని చెప్పని అమ్మ! నాన్న బాధపడితే తట్టుకోలేనిది. వాళ్ళిద్దరూ ప్రేమైక జీవులు. అమ్మకు గోవాలో బాగాలేనప్పుడు నాన్న మా అందరికీ ఫోన్ చేశాడు. ఎంత నెమ్మదిగా ఎంత గంభీరంగా అమ్మ అనారోగ్యం గురించి చెప్తున్నా గొంతులో కంగారు, గుండెల్లో పొంగి పొర్లుతున్న దుఃఖపు వాగులు తెలుస్తూ. మమ్మల్ని ఎంత కంగారు పెట్టాయి...? వీళ్ళంతా మరుసటి రోజు నాన్నను చేరే సరికి నాన్న ఎన్నివేల ప్రార్థనలు చేసి ఉంటాడు? ఎంత నరకాన్ని అనుభవించి ఉంటాడు..? ఎంతగా అమ్మ ఆరోగ్యం కోసం తపించి ఉంటాడు...? అంతగా ప్రేమించే నాన్నకు కూడా చెప్పలేదు ప్రయాణాన్ని గురించి.

ఆరోగ్యం తీవ్ర స్థితిలోనూ లేదు. బాగానే ఉంది. బాగా మాట్లాడుతూ ఉంది. ఆ మరుసటి రోజు రక్తనాళాలలో ఏర్పడ్డ బ్లాక్స్ తొలగించటానికి డాక్టర్లు నిర్ణయించారు. అమ్మ దగ్గర ఉందామని నేను ఆ రాత్రి ప్రయాణం చేస్తున్నాను. పైగా ఆ మరసటి రోజు అమ్మ పుట్టిన రోజు కూడా. దగ్గరే అన్నా వదినలు ఉన్నారు. అమ్మకు తోడుండటానికి మామయ్య వచ్చాడు. చక్కగా టీవీలో వార్తలు చూసింది. మామూలుగా మాట్లాడుతూ నాన్నను బాగా చూసుకొమ్మని అన్నా వదినకు చెప్పింది. కాసేపటికి ఊపిరి తీసుకోవటం భారంగా అనిపిస్తుంటే నర్సులతో కలిసి చక్కగా ఐసియులోకి నడిచి వెళ్ళింది. అప్పుడే నిర్ణయించుకొందా... ప్రయాణం కావాలని?

అమ్మ చిన్నప్పుడు మొండి – జగమొండి కథ చెప్పేది. మా అమ్మ కూడా మొండిదే....! ఒక్కసారి నిర్ణయం తీసుకొంటే మొండిగా దాన్ని అమలు చేస్తుంది. ఇప్పుడూ అలానే జరిగిందా...? చాలా కొన్నిసార్లు మాత్రమే అలా మొండిగా వుంటుంది. కాని ఆ నిర్ణయాలు ఎప్పుడూ మార్గమైనవి కానే కావు. ఈ రోజు అలానే నిర్ణయించుకొందా... అనిపిస్తుంది. నెల రోజులుగా రాత్రీ పగలు తనతోనే ఉంటున్న నాన్న ఆరోగ్యం గురించిన ఆందోళన అమ్మది. తన బి.పి.లో హెచ్చుతగ్గులు వచ్చిన కొద్దీ ఆయన కంగారు పడడం చూస్తూనే... ఉంది. అందుకే ఆరోజు బలవంతంగా, కొడుకు కోడలు ఉన్నారని, కాస్త విశ్రాంతి తీసుకొమ్మని ఇంటికి పంపింది. ఆయన ఫోను చేస్తే రాత్రికి రావద్దు పొద్దుటే రమ్మని ప్రేమగా చెప్పింది. ఆయన ఉంటే, ఆయన ప్రేమకు లొంగిపోయే తను, ప్రయాణం కాలేననుకొందో, ఆ



ప్రేమ తనను ఆపేస్తుంది అనుకొందో, ఆ రాత్రి ఆయనను రానివ్వ లేదు. తను ప్రయాణం అయిపోయింది.

అమ్మది నిండైన జీవితం. భగవంతుడు ఆశీర్వదించిన జీవితం నాది అనేది. నిజం. ప్రాణం పెట్టే భర్త, ప్రేమించే బిడ్డలు, డబ్బు వెదుక్కొనే అవసరం లేని దంపతుల ఉద్యోగ విరమణ జీవితం, డబ్బే లోకం అని అనుకోని పిల్లలు వారి ఉద్యోగాలు వారి ప్రశాంత కుటుంబ జీవితాలు మనవళ్ళు మనవరాళ్ళు, లోటు లోని తృప్తికర జీవితం.

గోవాలో ప్రయాణమైతే తట్టుకోలేదని నాన్నను, మా దగ్గరకు తెచ్చి, తన ప్రయాణానికి నాన్ననూ మమ్మల్నూ సన్నద్ధం చేసిందా... అనిపిస్తుంది. అనారోగ్యంతో పోరాడి పోరాడి అలసిందా అనిపిస్తుంది. జీవితాన్ని తనివి తీరా అనుభవించానని తృప్తి పడిందా? ఏమో... అమ్మ భయపడదు కాని ఆ రోజు స్టంట్ వేస్తున్నారంటే... గుండె ఆపరేషన్ నాటి చేదు స్మృతులు భయ పెట్టాయా... ? ఏమో... అమ్మ ప్రయాణమైపోయింది. తన పుట్టిన రోజునే తన ప్రయాణాన్ని ఖరారు చేసుకొంది.

ఈ రోజు మేమందరం అమ్మను పంపిస్తున్నాం. అందమైన ప్రశాంతమైన అమ్మను, నాన్న షష్ఠి పూర్తి ఉత్సవానికి తను కట్టుకొని అందంగా మెరిసిసోయిన చీరలో, అలంకరించి అమ్మను పంపిస్తున్నాం. అమ్మమ్మా.... అమ్మ జాగ్రత్త... నేను వచ్చిందాకా...! ఏ రూపంలోనూ ఎక్కడికీ నేను రాక ముందు అమ్మను పంపించకు. బాగా చూసుకో..

ఉండనా మరి నీ మాధురి

*

రచయిత చిరునామా:
డా. కొలకలూరి మధుజ్యోతి
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,
తిరుపతి – 517 502.